


# ఇంద్రధనుస్సు

పురాణపండ రంగనాథ్

## వారం వారం కథాప్రభ

**పాత సంవత్సరానికి వీడ్కోలు కొత్త సంవత్సరానికి స్వాగతం చెబుతూ ప్రజలు ఆనందోత్సాహాలతో వేడుకలు ఎందుకు చేసుకుంటారు? కానుకలు ఎందుకు ఇచ్చుకుంటారు?**

అనగనగా ఎవ్వరూ ఊహించలేని ఒకానొక 'మేజిక్' కాలం. అప్పుడు ఈ ప్రపంచం అంతా ఒకే రాజ్యంగా ఉండేది. ఇది ఆకుపచ్చని సస్యశ్యామల దేశం. బంగారం పండిన సంపన్న రాజ్యం. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఉన్న రోజులవి.

ఆ రోజులలో సంవత్సరానికి ఆరు మాసాలు వర్షాలుపడేవి. సూర్యుడు ఆరు మాసాలు ఎండ కాసేవాడు. అలాంటి విచిత్ర వాతావరణం ఆనాడు ఉండేది. ఆ రాజ్యాన్ని ఆరుగురు రాకుమారులు, ఒక రాకుమార్తె పాలించేవారు. రాకుమార్తె పెద్ద. ఆమె పేరు వయొలెట్ (ఊదా రంగు) ఆమె అందంగా ఉండేది. మెత్తటి మనసు ఆమెది. చక్కటి హాస్యపు మాటలు మాటలాడేది. రాకుమారు లందరూ తమ సోదరిని ఎంతగానో అభిమానించేవారు.

ఆరుగురు అన్నదమ్ములదీ చాలా చురుకైన స్వభావం. వారిలో ఇండిగో అనే పేరుగల రాకుమారుడు భలే గమ్మత్తుగా ఉండేవాడు. అతను తక్కువగా మాట్లాడేవాడు. అతని నెమ్మదితనం, అతడి అధికారం చూసి మిగిలినవారు భయపడేవారు. అతను గుర్రాల్ని బాగా నడిపేవాడు. రాజ పరివారపు రక్షణ శాఖకి అధిపతి అతను.

'ప్రిన్స్ బ్లూ' రెండవ రాకుమారుడు అతడు 'కామ్'గా ఉండేవాడు. నెమ్మదస్తుడు, మితభాషి. కానీ ఏం మాట్లాడినా తెలివిగా మాట్లాడేవాడు. అతడు న్యాయ శాఖాధిపతి. రాజ్యంలో అతడి తీర్పునకు తిరుగు లేదు. అంత న్యాయంగా, నిష్పక్షపాతంగా అతను తీర్పు చెప్పేవాడు.

ప్రిన్స్ గ్రీన్ మూడవ రాకుమారుడు. అతడు క్రియావాది. ప్రతి సమస్యకీ అతని దగ్గర చక్కటి సమాధానం ఉండేది. రాజ్యంలోని విహార కేంద్రాలు, తోటలు, భవనాలు అతనే నిర్మించాడు.

ప్రిన్స్ ఎల్లో నాలుగవ రాకుమారుడు. రాజభవనానికి వెలుగు తెచ్చిన వాడితడే. అతనెప్పుడూ హుషారుగా ఉండేవాడు. అతను నవ్వితే సమ్మోహనకరంగా ఉండేది. అతను ఎల్లప్పుడూ ఏదో ఒకటి మాట్లాడుతూండేవాడు. అయినా విసుగనిపించదు. వినాలనిపించే చతుర సంభాషణ అతనిది.

ప్రిన్స్ ఆరెంజ్ అయిదవ రాకుమారుడు. అతను మెరుపు తీగలాంటివాడు; నిప్పులాంటివాడు. ఎప్పుడూ రాజవంశపు దుస్తుల అలమారు దగ్గర ఉండేవాడు. ఇతడు రాజభవనంలో పండుగలకి, ఉత్సవాలకి అధిపతి. అతను ప్రిన్స్ ఎల్లోని ఎప్పుడూ విడిచి ఉండేవాడు కాదు. ఇద్దరూ కలిసే రాజ్యం



అంతా తిరిగేవారు. రాజ్యంలోని విచిత్ర వస్తువుల్ని, ప్రదేశాలను, అందమైనవాటిని వీరే ముందుగా కనుగొనేవారు.

ప్రిన్స్ రెడ్ అందరి కన్నా చిన్నవాడు. అతడే రాజ్యానికి నిధివంటివాడు. వెచ్చటివాడు, వాత్సల్యాన్ని పంచి ఇచ్చేవాడు.

ఒకరోజున రాకుమారి వయొలెట్‌కి జబ్బు చేసింది. అది ఒక వింత రోగం — రోజులో చాలాసార్లు ఆమె ఏడ్చేది, నవ్వేది, ఏడుపూ నవ్వూ ఒకేసారి వచ్చేవి. క్రమంగా ఆమె కాంతి విహీనం కాసాగింది. రాకుమారులు ఎంతో బాధపడ్డారు. ఎందరిచేతో వైద్యం చేయించారు. కానీ ఫలితం లేకపోయింది. ఎవ్వరూ ఆమె జబ్బుని నయం చేయలేకపోయారు. ఆమె శరీరం శుష్కించసాగింది. కాంతి తగ్గిపోసాగింది. శరీరం అంతా పాలిపోసాగింది. రాకుమారులు విచారించసాగారు.

●●●



## ఇవ్వలేదని ...

భార్య : అయ్యో! అయ్యో! ఎందుకండీ వాడి నలా చావబాదుతున్నారు?

భర్త : నేను మినిస్టర్ అని కూడా లేకుండా నా ఫోటో కింద — వాడికి రూపాయి ఇవ్వలేదని ఏం రాశాడో చూడు!

భార్య : ఇంతకీ ఏమని రాశాడు?

భర్త : ఊసరవెల్లి.

జె. ప్రమీలారాణి (విజయవాడ)

●●●



## ఆమని నిర్ణయం

నలబై చిత్రాల్లో నటించి మంచి నటిగా గుర్తింపు పొందిన ఆమని, పెద్ద హీరోల సరసనే కాకుండా, సబ్జెక్టు మంచిదైతే ఎటువంటి వారి సరసనైనా నటిస్తానని ప్రకటించడం అభినందించదగ్గ విషయమే. జయప్రద తన అభిమాన నటి అని చెప్పుకున్న ఆమని 'వార్నింగ్'లో జయప్రదతో నటించటం తన కెంతో సంతోషంగా ఉందని చెప్పింది. తెలుగులో నటీమణుల మధ్య ఈ రకమైన ఆరోగ్యకరమైన వాతావరణం ఉండడం చాలా మంచిది.

ఎస్.ఆర్ (హైదరాబాదు)

●●●

ఒకనాడు హఠాత్తుగా వారికి ఆకాశవాణి వినిపించింది ఇలా:

"రాకుమారులారా! విచారించకండి. మీ సోదరికి వచ్చిన వింత జబ్బు నయం కావాలంటే ప్రకృతి ఆమె చుట్టూ పరిశుభ్రంగా నిర్మలంగా నవ్వుతూ, పాడుతూ నాట్యం చేయాలి. ప్రకృతి ఒకే కాలంలో నవ్వాలి, ఏడ్వాలి!"

ఆకాశవాణి మాటలు విన్న రాకుమారులు ఒకరినొకరు తేరిపార చూసుకున్నారు.

"ప్రకృతి నవ్వడం, ఏడ్వడం, ఆడడం ఏమిటి? పిచ్చి ఆలోచన!" అన్నాడు ప్రిన్స్ రెడ్.

రాకుమారుడు బ్లూ మాత్రం నిశ్శబ్దంగా ఆలోచించాడు. అతనికి ఏదో ఆలోచన తట్టింది.

"నవ్వడం ... నవ్వు అంటే ఆనందం. పక్షుల పాట, పూలు వికసించడం, పళ్లు పండడం, చక్కటి వెలుగు వర్షించడం — అంటే సూర్యరశ్మిని, వర్షాన్ని ఒకేసారి మన అక్కయ్య దగ్గరికి తేవడం అని అర్థం!" అన్నాడు ప్రిన్స్ బ్లూ.

"అంటే వర్షం పడేలా చేయాలి, ఎండ కాసేలా చేయాలి. అంతే కదా!" అన్నాడు ప్రిన్స్ గ్రీన్.

"అది అసాధ్యం! ఎండ ఉంటే వర్షం ఉండదు, వర్షం ఉంటే ఎండ ఉండదు!" ప్రిన్స్ ఇండిగో నవ్వాడు.

అయినా ఆరుగురు రాకుమారులు తమ అక్కగారి జబ్బు నయం చేయాలనే పట్టుదలతో ఉన్నారు. అందుచేత ఆరుగురూ ఆలోచించారు. వర్షాన్నీ, సూర్యుణ్నీ ఒకేసారి తమ అక్కదగ్గరికి తేవాలని అనుకున్నారు.

రెండు బృందాలుగా విడిపోయారు. ఇండిగో, బ్లూ, గ్రీన్ — ఈ ముగ్గురూ ఒక బృందంగా వాన దేవుడి దగ్గరికి వెళ్లారు. ఎల్లో, ఆరెంజ్, రెడ్ — ఈ ముగ్గురూ సూర్యుడి దగ్గరకు బయలుదేరారు.

ఒక కాంతి కిరణాన్ని పట్టుకుని వీరు ముగ్గురూ ప్రయాణం ప్రారంభించారు. సూర్యుడికి దగ్గరయ్యే కొద్దీ వేడి ఎక్కువ కాసాగింది. వా రిప్పుడు సూర్యుడి సామ్రాజ్యంలో ఉన్నారు.

కొంతసేపు నిరీక్షించిన తర్వాత వారు ముగ్గురూ బంగారు రంగు గదిలోకి వెళ్లారు. అక్కడ ఒక కుర్చీపై పసుపు రంగులో ఉన్న బాలుడు ఆనందంగా కూర్చుని ఉన్నాడు. అతని చేతి వేళ్లకి ఉంగరాలు మెరుస్తున్నాయి. చేతులకి భుజ కీర్తులూ, కంకణాలూ ఉన్నాయి. తలపై మెరుస్తున్న కిరీటం అలంకారంగా ఉంది. అతటి ఒంటిమీది పట్టు వస్త్రాలు తళతళలాడుతున్నాయి. అతడిది దివ్యమంగళ రూపం.

అతడిని చూస్తూనే రాకుమారులు వంగి నమస్కరించారు.

"రాకుమారులకి స్వాగతం! విందు సమయానికి వచ్చారు. మా ఆతిథ్యం స్వీకరించండి!" అని సూర్యభగవానుడు వారికి అక్కడి డైనింగ్ టేబుల్ చూపించాడు. రాకుమారులకి ఆకలి లేదు. అయినా మర్యాద కోసం టేబుల్ దగ్గరి కుర్చీలలో కూర్చున్నారు. సూర్యుడూ వారితోబాటు విందారగించసాగాడు.

సూర్యుడు వారితో ఇలా అన్నాడు :

"రాకుమారులారా! నేను ప్రపంచం అంతా తిరిగి రావాలి కదా!" అని విపరీతంగా తిన్నాడు.

"బ్రేవ్!" అని త్రేన్చాడు. రాకుమారులు ఆశ్చర్యపోయారు.

"మీకు నేనేం చేయాలి?" సూర్యుడు అడిగాడు. రాకుమారులు చాలా వినయంగా, క్లుప్తంగా తమ అక్కగారి జబ్బు గురించి వివరించి చెప్పి సూర్యుడి సహాయాన్ని కోరారు. వాన దేవుడి పేరు వినగానే సూర్యుడు చిర్రుబుర్రు లాడాడు.

"వాడా! చలి ముసిలాడు. ఆ వానతో నేను కలవను. అసాధ్యం!" అని సూర్యుడు గద్దించాడు.

సూర్యుడి ధోరణి చూసి రాకుమారులు వెనక్కి తగ్గారు. ఒకరినొకరు ఆందోళనతో చూసుకున్నారు. కొంతసేపయ్యాక ప్రిన్స్ ఆరెంజ్ నెమ్మదిగా ఇలా అన్నాడు.

"ఏంచేత?"

"వాన దేవుడే పెద్ద నస. ఏ పార్టీకి వచ్చినా అంతా చలి, తడుపు. కిందటి వారం పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్తూ పార్టీ చేశారు. వానదేవుడు వచ్చాడు. అంతా రసాభాస. ఆ పార్టీకి శుక్రుడు, బృహస్పతి, కుజుడు ఎందరో వచ్చారు. ఏం లాభం? వానదేవుడి రాకతో ఆనందం అంతా పోయింది!" సూర్యుడు కోపంగా అన్నాడు.

రాకుమారులు మరల ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. ముగ్గురూ కలిసి సూర్యుణ్ని ప్రార్థించారు. అయినా సూర్యుడు చలించలేదు. మంకుపట్టు వదలలేదు.

విసుగెత్తి ఆరెంజ్ రాకుమారుడు సూర్యుడికి బంగారం లంచంగా ఇస్తానన్నాడు. ఆయన మరీ మండిపడ్డాడు. ఆ సమయంలో ఎల్లో రాకుమారుడు రంగప్రవేశం చేశాడు. సూర్యుడికి నమస్కరించాడు. సోదరులని పక్కకు పిలిచి తాను ముందుకు వెళ్లాడు.

"సూర్యదేవా! మా అక్కయ్య జబ్బు నయం చెయ్యి. నువ్వు మమ్మల్ని ఏం చేయమంటే అదే చేస్తాం!" అన్నాడు ఎల్లో రాకుమారుడు. అతని మాటల తీరుకి సూర్యుడు కొంచెం కరిగాడు. ఆయన కోపం కొంచెం తగ్గింది.

"రాకుమారులారా! మిమ్మల్ని ఒట్టి చేతులతో పంపడం నాకు భావ్యం అనిపించడంలేదు. కాని ఏం చేయను? సంవత్సర చక్రవర్తి నాకు ఆరు నెలలు, ఆ వాన దేవుడికి ఆరు నెలలు అధికారం ఇచ్చాడు. నాకు అధికారం లేని పని ఎలా చేయగలను?"

అన్నాడు సూర్యుడు.

సూర్యుడు తమకి సహకరించే స్థితిలో లేడని గ్రహించి ముగ్గురు రాకుమారులు హుటాహుటిన ఇంటికి, భూమండలానికి తిరిగి వచ్చేశారు. మిగిలిన ముగ్గురు సోదరులూ ఏం సాధించి వచ్చారో తెలుసుకుందామనుకున్నారు.

* * *

'వానదేవుడిని కలుద్దాం' అని వెళ్లిన ఇండిగో, బ్లూ, గ్రీన్ రాకుమారుల అనుభవం మరీ వింతగా ఉంది. ఒక మేఘం లిఫ్ట్ ఇవ్వగా వారు ముగ్గురూ వానదేవుడి భవనానికి వెళ్లారు. అక్కడ గాఢాంధకారం ఆవరించిన ఒక హాలులోకి వెళ్లారు.

ఆ హాలులో అయోమయంగా తిరుగుతున్నవారికి "ఎవరు మీరు?" అని గద్దించి అడిగిన కంఠం వినిపించింది. అటూ ఇటూ చూశారు. చీకటి తప్ప ఏమీ కనిపించలేదు. భయపడినవారు అప్రయత్నంగా మరొక గదిలో ప్రవేశించారు.

ఆ చీకటికి వారి కళ్లు అలవాటుపడ్డాయి. అక్కడ వారికి ఒక ఆకారం కనిపించింది. ముగ్గురూ భయపడ్డారు.

"రాకుమారులారా! క్షమించండి. మిమ్మల్ని భయపెట్టడం నా ఉద్దేశం కాదు. నా గొంతే అంత! అదీ కాక, ఇక్కడికి ఎవరూ రారు. ఇది నిర్జన ప్రదేశం. మీరు వచ్చారు. నా కదే సంతోషం!" అంది ఆ ఆకారం.

రాకుమారులు ఆ ఆకారాన్ని ఈసారి పట్టిపట్టి చూశారు. అలాంటి ఆకారాన్ని వా రెప్పుడూ చూడలేదు.

అత డొక పురుషుడు. కళ్లవెంట ఏకధారగా నీళ్లు కారుతున్నాయి. ముఖమంతా విచారంగా ఉంది. దుఃఖరశ్మిలా ఉన్నాడతను. అతడి దుస్తుల చివర్ల, కంటి నుంచి నీటి చుక్కలు కారుతున్నాయి. అతడి జుట్టు చీకటి వేళ్ల వలె ఉంది. చిందరవందరగా ఉంది. అతనే వానదేవుడు.

"ఇలా ఎందుకు వచ్చారు?" అతను ప్రశ్నించాడు.

రాకుమారులు ముగ్గురూ అతనికి నమస్కరించారు. తాము వచ్చిన పని చెప్పారు.

వారి మాటలు వింటూనే వానదేవుడి ముఖం పెద్దగా అయింది. పాలిపోయింది. కళ్లు చేటలంత అయ్యాయి. అతను ఘూర్ణిల్లి చూశాడు.

"అంటే నేను ఆ సూర్యుడి దగ్గర సాష్టాంగపడాలన్నమాట!" అన్నాడు చురచురలాడుతూ.

"మీ సహాయం కావాలి" ప్రిన్స్ గ్రీన్ బతిమాలుతూ అన్నాడు.

"ఏం లాభం లేదబ్బాయ్! నా వల్ల ఏమీ కాదు. ఆ సూర్యుడు మా ఇద్దరి కలయికకి అంగీకరించడు. నేనేం చేయలేను.




అధికారి : ఏమోయ్! నేను ఇప్పుడే విన్నాను — నిన్న రాత్రి తప్పతాగి చక్రాల బండి ఒకటి తోసుకుంటూ ఆఫీసు చుట్టూ తిరిగావట, నిజమేనా?

క్లర్క్ : నిజమే, సార్!

అధికారి : మరి అప్పుడు నే నెక్కడ ఉన్నాను?

క్లర్క్ : ఆ చక్రాల బండిలోనే, సార్!

ముద్దా రమణమూర్తి (అనంతపు-రం)

కిందటివారం విందు జరిగింది. నేను వెళ్లాను. సూర్యుడు వచ్చాడు. నన్ను కోపగించాడు, అవమానించాడు. అతడు గర్విష్ఠి, మూర్ఖుడు. అతడితో నేను కలిసినా, అతడు నాతో కలవడు!" వానదేవుడు అవమానం, కోపం కలిసిరాగా గర్జిస్తూ అన్నాడు.

వానదేవుడు తన దైన్య స్థితికి బాధపడ్డాడు. కళ్లనీళ్లు ఉబికుబికి వచ్చాయి.

అతడు తమకి సహాయం చేయాలనుకుంటున్నాడనీ, సూర్యుడిపై అతడు మాత్రం కొద్దిగా కోపంతో ఉన్నాడనీ రాకుమారులు గ్రహించారు.

"సూర్యదేవుడిని మేం తీసుకు వస్తాం, వానదేవా! నువ్వువస్తావా?" అని వేడుకుంటూ అడిగారు.

"ఏం లాభంలేదు రాకుమారులారా! నా వంతు ఆరుమాసాలూ అయిపోయింది. ఇప్పుడు నే నేం చేయలేను!" అన్నాడు వానదేవుడు.

"వానదేవా! మేం సంవత్సర చక్రవర్తి దగ్గరకి వెళ్లి అడుగుతాం. ఆయన అంగీకరిస్తే మాతో వస్తావా?" అని ప్రిన్స్ బ్లూ నెమ్మదిగా అడిగాడు.

"నిజంగా మీ రలా చేయగలరా?" అని ఆశ్చర్యంతో వానదేవుడు ఆ రాకుమారుల్ని నిమిరి, ఆప్యాయంగా చూసి పంపాడు.

* * *

వానదేవుడి దగ్గర నుంచి ముగ్గురు సోదరులూ భూమికి తిరిగి వచ్చేసరికి వారి సోదరి వయొలెట్ పరిస్థితి ఏమీ బాగాలేదు. ఆమె స్పృహలో లేదు. గంట గంటకీ ఆమె ఆరోగ్య పరిస్థితి క్షీణించసాగింది. ఏ క్షణంలో అయినా ఆమెకి ప్రాణాపాయం రావచ్చు. ఇంకా ఆలస్యం చేయకూడదని రాకుమారులు సంవత్సర చక్రవర్తిని కలిసి ప్రార్థించాలని నిర్ణయించుకున్నారు.

సంవత్సర చక్రవర్తి ముసలివాడు. నెరసిన పొడువాటి గడ్డం, ముక్కుమీదకి జారుతున్న కళ్లజోడు లోనుంచి అతను రాకుమారులను చూశాడు.

"మీ రెందుకు వచ్చారో నాకు తెలుసు. మీ కోరిక నెరవేరుస్తాను. కానీ నాకు రెండు వరాలు ఇవ్వాలి. సంవత్సరం ఆఖరు రోజున భూగోళంలో అందరూ నన్ను మర్యాదగా, ఆప్యాయంగా చూడాలి. అలాగే కొత్త సంవత్సరం రోజున పుట్టే నా చిన్నారి కొడుక్కి కానుకలతో, మంచి తీర్మానాలతో స్వాగతం చెప్పాలి. ప్రతి కొత్త సంవత్సరం భూగోళంపై మంచి మంచి మానవజాతి ఆవిర్భవించాలి!" అని అడిగాడు సంవత్సర చక్రవర్తి.

రాకుమారులు "అలాగే" అని అంగీకరించారు. వేగంగా సూర్యుడి దగ్గరికి, వానదేవుడి దగ్గరికి వెళ్లారు.

"భలే పిల్లలురా! వస్తాను!" అన్నాడు సూర్యుడు.

"మొత్తానికి సాధించారు. కాని మేం ఇద్దరం కలిసిఎలా రావాలి?" అన్నాడు వానదేవుడు.

"మేం కలిసే ఉపాయం కూడా మీరే ఆలోచించండి." అన్నాడు సూర్యుడు.

రాకుమారులు ఒకరిముఖా లొకరు చూసుకున్నారు. సూర్యుడు, వానదేవుడు కలిసి భూలోకానికి రావడాని కని వారు చేతులు కలిపి అర్ధచంద్రవంక లాంటి వంతెన కట్టారు. వారి శరీరాలు స్వర్ణాలయం వలె వ్యాపించాయి.

సూర్యుడు విశ్వాసంతో ఆ వంతెన మీదికి వచ్చాడు. వానదేవుడు ఒక కాలు మోపాడు. ఇద్దరూ ఆ వంతెనపై నడిచారు. అది రంగుల వంతెన. ఇంతలో హఠాత్తుగా వాన కురవసాగింది. తోడుగానే సూర్యుడు ప్రకాశించసాగాడు. అంటే ఏడుపూ, నవ్వూ — ఒకేసారి ప్రకృతిలో కనిపించాయి. రాకుమారి వయొలెట్ కనులు తెరిచింది. ఆమె ఆరోగ్యం బాగుపడింది.

"నా తమ్ముళ్లేరి?" ఆమె ఆత్రంగా అడిగింది. అక్కడి పరిచారకులు ఆకాశంవైపు చూపారు. ఆమె అటువైపు చూసింది. అక్కడ ఆమె సోదరులు అర్ధచంద్రాకారంగా రంగుల ధనుస్సు వలె మెరుస్తున్నారు.

"నేనూ వాళ్లతోనే ఉంటాను!" అని ఆమె చేతులు పైకెత్తి ఆకాశంలోకి ఎగిరింది. వంతెనకి పైన ఆమె నిలిచింది. అక్కడే ఆనాటి నుంచి ఆ రాకుమారీ, ఆమె తమ్ముళ్లు ఆరుగురూ ఉండిపోయారు. సూర్యుడు, వానదేవుడు ఆ వంతెన మీద తటస్థపడినప్పుడు ఆ కుటుంబం అంతా కలిసి ఐకమత్యంగా నిలబడి ఉండడం నేటికీ మనం చూస్తున్నాం. అదే ఇంద్ర ధనుస్సు!

★

(శ్రీమతి మేనకా గాంధీ రాసిన ఇంగ్లీషు కథకు ఇది స్వేచ్ఛానువాదం)